విమెన్స్ కాలేజీ వదిలారు. పెద్దబుట్ట నిండుగా తెచ్చివెదజల్లిన అందమైన పువ్వుల్లా ఆడపిల్లలు బయటకు వస్తున్నారు గుంపులు గుంపులుగా. జయా శాంతీ జంటగా నడుస్తున్నారు. ఇద్దరి ఇండ్లూ ఒకచోట కాదుగాని, బస్టాపూ, కాలేజీ ఒకటే. ప్రతిరోజూ కలిసి వెళ్లి కలిసే వస్తుంటారు. ఇద్దరి మధ్యా స్నేహమే గాదు, గాఢమైన అనుబంధమూ వున్నది. దాపరికాలూ రహస్యాలూ వుండవా యిద్దరి మధ్య. మనసు విప్పుకుని మాట్లాడుకుంటారు.

"ఏమిటో ఇవాళ డల్‌గా కనిపిస్తున్నావు. మం ట్లోనా ఇంట్లోనా చికాకు"–జయ ప్రశ్నకు శాంతి నిట్టూర్చింది.

"ఏవుందీ మామూలే. మళ్లీ జాతర జరగబోతున్నది"– జాతరనేది పెండ్లి చూపులకు శాంతి పెట్టిన ముద్దుపేరు. ఇద్దరి పెద్దలూ కుటుంబనియంత్రణ పాటించినవాండ్లే. ముగ్గురే పిల్లలు. కాని జయావాండ్లది కాస్తకలిగిన కుటుంబం. జయ ఒక్కతే ఆడపిల్ల. అన్నలిద్దరూ చదువు పూర్తయి ఉద్యోగాలు చేస్తున్నారు. అందుకే ఆర్థికంగా వాండ్లు బాగా మెరుగ్గానే వున్నారు. శాంతి తండ్రికి ఇద్దరాడపిల్లల తర్వాత కొడుకు. పిల్లలందర్లోకీ శాంతి పెద్దది. ముగ్గురూ చదువుకుంటున్న పిల్లలే గనుక కొంచెం ఆర్థికస్థితి మందంగానే వున్నది.

ఏడాది నుంచీ శాంతికి పెండ్లి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తల్లి ప్రతి రోజూ అంటూనే వుంటుంది.


"నామాట వినండి. దానికి త్వరగా పెండ్లి చేద్దాం. ఆ ఖర్చుమంచి బయటపడేసరికి ఎంత లేదన్నా నాల్గయిదేండ్లు ములాగ్గా అవుతుంది. ఆసరికి చిన్నది ఎదిగి వస్తుందాయె. దాని సంగతి చూడాల్సివచ్చె."

అందుకే శాంతి పెండ్లికి త్వరపడుతున్నారు పెద్దలు. "ఏమిటి అప్పుడే పెండ్లి ప్రయత్నాలా. మరి చదువో..."జయకిదెంతో ఆశ్చర్యం. బి.ఏ. ఫైనలియరుకు వచ్చినప్పట్నుంచీ శాంతికి పెండ్లి చూపులు జరుగుతూనే వున్నాయి. "పర్వాలేదే జయా! చూడగానే అవుతాయా పెండ్లిండ్లు. అన్నీ కుదిరి పెండ్లి అంటూ జరిగేనాటికి నేను గ్రాడ్యుయేటునే గాదు, మావాండ్లు చదివిస్తే పోస్ట్‌గ్రాడ్యుయేటని కూడా అనిపించుకుంటాను భయపడకు!" జయకు నవ్వొస్తుంది. "వింటుం టేనే తమాషాగావుంటుందే మరి. ఇక చూస్తే..ఆ పెండ్లి చూపులూ అవీ చూస్తుంటే ఎలా వుంటుందో! థ్రిల్‌గా వుంటుందేమో కదూ శాంతి..."

"థ్రిల్లా పాడా! వాండ్లూ వాండ్ల చూపులూ ఆ దరిద్రప్రశ్నలూ. ఛ.ఛ జీవపువరకమే. కొందరు మరీ అసహ్యంగా ప్రవర్తిస్తారు. కొందరు పాడు ప్రశ్నలు. కొందరు వంటరిగా మాట్లాడాలనటం."

"అంటే. అంటే. యెక్కడికైనా సినిమాకో షికారుకో వెళ్దాం రమ్మంటారా. నీవెప్పుడైనా వెళ్లావా..."

"ఇంకా నయం. సినిమాకే. ఇంట్లోనే అలా మా ఇద్దర్నీ వదిలేసి పెద్దాళ్లు అవతలకు వెళ్లారే. అదీ ఒక్కసారే. ఒకడలా కోరాడన్న మాట. తిరావాడడిగిన ప్రశ్న–కుటుంబ నియంత్రణ గురించి నీ అభిప్రాయమేమి టని."జయ కుతూ హలంగా అన్నది . "మరి నీవేమన్నావే." శాంతి చాలా తేలిగ్గా నవ్వింది.




"ఏమనటానికేమున్నదీ.'ఇంత చవట ప్రశ్న వేసిన నీలాంటివాడిని చేసుకోను సిద్ధపడు తున్న నేనెంతకన్నా చవటనుగదా'అని మనసులో చంపలేసుకుని పైకి నీయిష్టమెలాగో అలాగే'నన్నాను. నా జవాబు విని చాలా సంతోషించి నట్టున్నాడు. నాకు పిల్లలంటే యిష్టం లేదన్నాడు. నాకు వళ్ళు మండిపోయింది. అయినా పైకి నవ్వుతూ, 'మరిహనేం. పెండ్లికి ముందే ఆపరేషన్ చేయించుకోవచ్చుగా'అన్నాను. వాడ్ని కట్టుకుని అలాంటివాండ్లను మరో ఇందర్ని తయారుచేసి దేశాన్ని పాడు చేసే కంటే అదే మంచి పని కదూ."

జయ కిలకిలనవ్వింది. శాంతి పెండ్లిచూపుల కథలు వినటం జయకు చాలా సరదా. మర్నాడు శాంతి కాలేజీకి రాలేదు. మూడోరోజు వచ్చింది. జయ ఆత్రంగా, "ఏమైందే..."శాంతి ముఖం వికసించి వున్నది. కండ్లు మెరుస్తున్నాయి. బుగ్గలు కొద్దిగా యెర్రబడ్డాయి కూడానూ. "పర్వాలేదే ఈసారి కాస్త బాగానే వున్నది. వెరీ సింపుల్. తల్లీకొడుకూ ఇద్దరే వచ్చారు. పిచ్చి ప్రశ్నలేమీ వెయ్యలేదు. ఆవిడకూడా పాపం మంచిదే."

"అబ్బ ఆవిడ సంగతీ ఈవిడ సంగతీ! ముందు అసలు సంగతి చెప్పవోయ్" శాంతి చిన్నగా నవ్వింది.

"ఏవుందీ గ్రాడ్యుయేట్. ఎల్.ఐ.సి.లో జాబ్. మనిషి బాగానే–కాదు_ చాలా బాగున్నాడు." జయకండ్లెగరేసింది. శాంతి మొహం ఎర్ర బడింది. వారం జరిగింది. పిల్ల నచ్చిందని చెప్పి కట్నకానుకలు మాట్లాడుకుని ఎంత ఇస్తారో ఎంత ఇవ్వగలరో కనుక్కుని వెళ్లారు పెండ్లి వాండ్లు. ఏ సంగతీ తెలియపరుస్తా మన్నారు కాని వాండ్లనుంచి ఏ కబురూ రాలేదు. శాంతి తల్లీ తండ్రీ రోజూ యెదురు చూస్తున్నారీ వారం రోజులనుంచీ.

"నిజంగా ఈ పెండ్లిచూపులనేవి అంటు వ్యాధిలా వున్నాయే శాంతీ. నీతో రోజూ ఈ విషయం గురించి మాట్లాడుతున్నానా. నీ జబ్బు నాకూ అంటుకున్నది."శాంతి మొదట తెల్లబోయి అర్థం కాగానే నవ్వింది.

"అమ్మదొంగా చెప్పవేం! కంగ్రాట్స్! యెప్పుడు చెప్పు. జరిగాయా. జరగబోతున్నాయా."

# తెగింపు

'కనకవల్లి'



"రేపు జరగబోతున్నాయి గాని, నీవు నాకో చిన్న హెల్ప్ చెయ్యాలోయ్ శాంతీ.." శాంతి ఉత్సాహంగా అన్నది "చెప్పు చెప్పు. సంకోచ మెందుకు. ఒకటి గాకుంటె వంద చేస్తాను." జయ సంకోచించింది కాసేపు.

"మరేం లేదు. నాకక్కచెల్లెండ్లు లేరని నీకు తెల్సుగా. వదినలింకా రాలేదాయె. రేపు నీవు నాక్కాస్త సాయం చేస్తావేమోననీ. నీవు సీనియరువు గదా. నేనింకా కొత్తదాన్ని. అందుకనీ."

నిజమే. జయకొత్తది. అందుకే శాంతిని రమ్మన్నది. ఈమాట పెద్దవాండ్లెవరూ ఒప్పు కోరని శాంతికి తెలుసు. జయ అన్నట్టు శాంతికి చాలా విషయాలు తెలుసు.ఇద్దరూ ఒక ఈడు వాండ్లయినా, జయకు తెలియని జీవితసమస్యలు శాంతికి చాలా తెలుసు. కాని ఈ మాట పైకి అనను బాగుండదు. ఈ పని కాకుండా జయ కోసం మరే పనైనా చెయ్యనుశాంతి సిద్ధమే. అందుకే రకరకాల అభ్యంతరాలు చెప్పింది. కాని జయ మొండి పట్టుపట్టింది.

"నీవా పెండ్లివాండ్ల యెదురుకు రానక్కర్లేదు. లోపలే వుండు. నాక్కొంచెం సాయంగా వుంటావని. అంతే..."

చివరకు వెళ్లక తప్పలేదు శాంతికి. శాంతి వూహించినట్టు ఆమెను చూడగానే జయ తల్లి ముఖం అదొకరకంగా మారింది. అయినా ఆమె నవ్వుతెచ్చుకుని సాదరంగానే ఆహ్వానించింది. జయా,శాంతీ లోపలి గదిలో కూచుని కబుర్లూ అలంకరణల్లో మునిగిపోయినారు. తల్లి వంట గదిలోతన పనిలో తను నిమగ్నమై పోయింది. పెండ్లి వాండ్లు వచ్చారు. జయ పెద్దన్న తల్లి దగ్గరకు వచ్చి "గాభరా పడకమ్మా. ఎందరో కాదులే. ఇద్దరే వచ్చారు. మధ్యవర్తి సరే." అన్నాడు-ఆమె ఆశ్చర్యంగా "ఇంతాచేసి ఇద్దరేనా! అబ్బాయిని చూచావా నువ్వు."

"అబ్బాయి మాత్రం చక్కగావున్నాడమ్మా గ్రాడ్యుయేటేనట గాని జాబ్ చేస్తున్నాడట ఎల్.ఐ.సి.లో.." జయతలలో పువ్వులు సర్దుతున్న శాంతి ఉలిక్కిపడిందీ మాటలకు. 'గ్రాడ్యుయేటా. ఎల్.ఐ.సి.లో జాబా? అందంగా వుంటాడూ. ఎవరు. ఎవరా పెండ్లి కొడుకు. ఏమిటీ జరుగుతున్నదంతా... శాంతి కేమిటో చిత్రంగా వున్నది.

ఇంతలో అన్న లోపలకు వచ్చి "రా జయా" అంటూ శాంతిని చూచి చిరునవ్వుతో

మర్యాదగా, "మీరూ రండి. జయకు సాయం గానూ వుంటుంది. అతన్నిమీరూ చూసినట్టు వుంటుంది." అన్నాడు. శాంతి ఏదో అనబో యేంతలో జయ,"వద్దులే అన్నయ్యా శాంతికి సిగ్గు యెక్కువ. అసలిక్కడికే రానన్నది. నేనే బలవంతంగా పిల్చుకుని వచ్చాను" అంటూ వెళ్లిపోయింది. జయ తల్లి కూడా అక్కడికే వెళ్లటంతో వంటరిగా మిగిలిపోయిన శాంతి కుతూహలం ఆపలేకపోయింది. అటువైపు హాలు వరకూ నడిచి అక్కడున్న చిన్న కిటికీ తెర కొద్దిగా తొలగించి మెల్లగా తొంగి చూచింది. తన అనుమానం నిజమే. ఆ పెండ్లి కొడుకే.

ఆ తల్లీ కొడుకూ. ఆ మధ్యవర్తి సాంబయ్యే. ఈ సంబంధం గొప్పదనాన్ని వర్ణించి చెబుతున్నాడు. వీండ్లే తనను చూచి వెళ్లి పిల్ల వచ్చిందని చెప్పి కట్నకానుకలెంత యిస్తారో, ఎంత ఇవ్వగలరో అడిగి తేల్చుకుని, తమకు సమ్మతమైందీ కానిదీ తెలియబరుస్తామన్నారు. రోజూ వీండ్ల కబురుకోసం యెదురు చూస్తున్నారు తామంతా. ఆ సంబంధాన్నే ఆ మధ్యవర్తి సాంబయ్యే ఇక్కడికి తీసుకుని వచ్చాడు. శాంతి బొమ్మలా నిలుచున్నది.

పెండ్లిచూపులు ముగిసి వాండ్లు వెళ్లటానికి లేచారు. సాంబయ్య లోపలకు వచ్చి జయతల్లితో అంటున్నాడు.

"మీకేం సందేహమక్కర్లేదు కాంతమ్మ గారూ. ఈ సంబంధం స్థిరపరిచే భారం నాది. మీరు నిశ్చింతగా వుండండి. ఒక్కతే ఆడపిల్ల. బాగా ముట్టజెబుతారు . అమ్మాయి అందగత్తె. గ్రాడ్యుయేటూనూ. వప్పుకోకేం జేస్తారూ. మీకెందుకు చూడండి. నాల్రోజుల్లో శుభవార్త పట్టుకొచ్చే బాధ్యత నాది. నిశ్చింతగావుండండి"

పక్కగదిలోవున్న శాంతిని సాంబయ్య చూడలేదు. ఈ మాటలు వినగానే శాంతి సందేహం తొలగిపోయింది. అదీ రహస్యం. జయ కలిగినింటి వంటరి ఆడపిల్ల. ఇద్దరన్నలూ తండ్రీ సంపాదిస్తున్నారు. ముద్దుముచ్చట్లు జరపగలరు. పెండ్లివాండ్లు వెళ్లిపోగానే తలనొప్పి సాకుతో ఎంత బతిమాలినా టిఫినైనా చెయ్యకుండా ఇన్ని కాఫీ మాత్రం తీసుకుని ఇంటికి వెళ్లింది శాంతి. వారం రోజులు జరిగిపోయినాయి. శాంతీ,జయ మామూలుగానే కాలేజీకి వెళ్తున్నారు వస్తున్నారు. ఏవో విషయాలు మాట్లాడుకుంటున్నారు కాని ఈ విషయం ఎవరూ ఎత్తలేదు. పెండ్లివాండ్ల కబురు కోసం శాంతి తల్లీ తండ్రీ ఎదురు చూస్తూనే వున్నారు. చివరకోనాడు శాంతి సాహసించి అడిగింది. "ఆరోజా పెండ్లి చూపులు-ఏమైందే జయా ఆ సంబంధం."

"కుదర్లేదు. నేనే వద్దన్నాను." జయ మాటలకు శాంతి ఆశ్చర్యపోయింది. జయ వద్దన్నదా! ఎందుకూ?

"అదేమిటి. నీవు వద్దన్నావా. ఎందుకూ? ఎందుకు జయా. ఆ పెండ్లి కొడుకు నీ వూహించి నట్టు లేడా"

"లేదు— రూపం గాదు, అర్హత. గ్రాడ్యుయేట్—ఉత్త క్లర్క్. అంతేగా. వాండ్ల ఆశలేమో ఆకాశంలో వున్నాయి. వాండ్లడిగినంతా మావాండ్లివ్వగలరనుకో. నాకే యిష్టం

## శేషేంద్రజాలం

నీవు పీడిత ప్రజలకే చెందుతావు
అక్షరమై అందరికీ అందుతావు
మర్రి చెట్టు నీడనంతా నీవు
ఒక్క గులాబీ నీడలోనే పొందుతావు

ఆమె ఒక నవలను గర్భంతో ఉంది
ఆమె పుస్తకాల కంపెనీకి ఇరుసు
నాజేబులో రూపాయి నిర్ఘాంత పోయింది
ఏ చేయి దొంగిలించిందో దానికి తెలుసు

— శేషేంద్ర

లేదు. అందుకే వద్దనేశా."

"వాండ్లు కోరినంతా మీవాండ్లివ్వగలరన్నావుగా. ఇకనెందుకొద్దన్నావూ" శాంతికి చిత్రంగా వున్నది.

"ఎందుకంటే చెప్తావిను. బజారుకు వెళ్తాం. నీచేతిలో వెయ్యిరూపాయలున్నాయి. వంద రూపాయల చీర బాగానే వున్నది. అయినా కొనమంటావా. దానికే వెయ్యి రూపాయ లివ్వమంటావా. నీవే చెప్పమరి."

"అదేమిటి చీరలూ పెండ్లి కొడుకూ..?" జయ నవ్వింది. "రెండూ ఒకటే. అంతా బిజినెస్ అయినప్పుడిక బేరసారాలుండవద్దూ. ఇక డొంక తిరుగుడు మాని సూటిగా చెప్తా విను. మనిద్దరి వయసూ, చదువూ ఒకటే. రూపమంటావా. నిజం చెప్పాలంటే నాకంటే నీవు చాలా బాగుంటావు. మరివాండ్లు నిన్ను కాదని నన్నెందుకిష్టపడ్డారు చెప్పూ. ఇదుగో ఇందుకే. మావాండ్లకు బాగా డబ్బున్నది. ఒక్కతెనే ఆడ పిల్లను. తాముకోరినవన్నీ ముట్టజెబుతారనే గదా. ఏమంటావ్" జయ మాటలకు శాంతి తెల్లబోయి చూచింది.

"అంటే..అంటే..అయితే నీకు అంతా తెలిసిపోయిందన్నమాట" జయ నవ్వుతూనే తలవూపింది.

"తెలుసు. నీపెండ్లి చూపులయింతర్వాత ఆ మధ్యవర్తి మాదగ్గరకు వచ్చాడు. పాపం ఎవరికీ తెలియదు మన స్నేహాన్ని గురించి. నీవు వర్ణించింది, అతను చెప్పిందీ వింటేనే నాకు అనుమానం కలిగింది. నిన్ను చూచి వప్పుకుని కట్న కానుకలు మాట్లాడుకుని కూడా మా ఇంటికొచ్చారంటేనే అర్థం కాలేదూ వాండ్ల తత్వం. వాండ్లు అడిగిన రేటుకు మావాండ్లు వప్పుకునే సరికి వాండ్లు సరేనన్నారుగాని నాకిష్టం లేదు. వాండ్ల ఆశలు వాండ్లకుండటం తప్పేలా లేదో, మన కోరికలు మనం కోరటంలోనూ తప్పు లేదు. అంత డబ్బుపోసి ఉత్తగ్రాడ్యుయేట్ ఎందుకూ. ఇంజనీర్నో, డాక్టర్నో చూడవచ్చు గదా అనుకున్నానంతే."

శాంతి కండ్లు ఆనందంతో మెరిసిపోయినాయి. 'ఈ జయ ఇన్నాళ్ళూ తనకు తెలిసిన తన స్నేహితురాలు జయేనా. ఈమెతో స్నేహంచేసీ ఇన్నాళ్ళూ తనెందుకిలా మొద్దులా పడివున్నదీ!'

ఆమె ఇంటికి వచ్చేసరికి తల్లి వికసించిన ముఖంతో యెదురు వచ్చి నవ్వుతూ చెప్పింది—

"పెండ్లివాండ్లదగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందే శాంతీ. మనమిచ్చే కట్నానికే వప్పుకుంటున్నామని రాశారు. ముహూర్తాలు పెట్టుకునేందుకు మీ నాన్నగార్ని వెంటనే బయలుదేరి రమ్మని రాశారు."

లోపల గదిలోకి వెళ్తున్న శాంతి విసురుగా తిరిగి చూచింది. "అమ్మా!నాన్నగారు వెళ్లనక్కర్లేదు. నేనా సంబంధం చేసుకోను. మీరు ఏమన్నా, ఏం చేసినా, చంపినా సరే, నేను ఒప్పుకోను. ఆ పెండ్లి నాకొద్దు. జీవితాంతం ఇలాగే వుండమన్నా ఉండిపోతాగాని ఆ గాలి వాటు మనుష్యుల యింట్లో ఛస్తే అడుగు పెట్టను. అంతే" అని తల్లి సమాధానం ఆశించకుండానే లోపలకు వెళ్లిపోయింది. ●